ong-8_ong-8.qxd 3/2/2026 1:03 AM Page 1



- వేధింపులకు ఖబడ్దార్.. జైలే గమ్యం!
- ఆత్మవిశ్వాసమే అమ్మాయిల అసలైన బలం
- ప్రేమ విఫలమైతే జీవితం ముగిసిందనే కాదు
- ఆర్థిక స్వావలంబనతోనే నిజమైన గౌరవం
- మహిళల కోసం 24 గంటల అండగా విశాఖ పోలీసులు
- దేశంలోనే సురక్షిత నగరంగా విశాఖకు గుర్తింపు
- ఇబ్బందులు ఎదురైతే వెంటనే కాల్ చేయండి: 7995095799
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మహిళా దినోత్సవం సందేశం

# మహిళల భద్రతపై రాజీ లేదు






(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నగర మహిళల భద్రత, హక్కులు , భవిష్యత్తుపై కీలక సందేశాన్ని ఇచ్చారు. మహిళలు ఆన్‌లైన్ గానీ, ఆఫ్‌లైన్ గానీ ఎక్కడైనా వేధింపులకు గురికాకూడదని, తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆత్మవిశ్వాసమే విజయానికి మూలం టీనేజ్ వయసులో ప్రేమ వ్యవహారాల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని యువతికి హితవు పలికారు. ఒక అమ్మాయి జీవితం ఎవరో ప్రేమిస్తారా లేదా అన్నదానిపై ఆధారపడకూడదని స్పష్టం చేశారు. సరైన సమయంలో ప్రతి ఒక్కరికీ సరైన జీవిత భాగస్వామి దొరుకుతారని, లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు. ఆర్థిక స్వావలంబనతోనే నిజమైన రక్షణ ప్రతి అమ్మాయి చిన్నప్పటి నుంచే విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే మహిళలకు నిజమైన గౌరవం, భద్రత లభిస్తాయని తెలిపారు. లక్ష్యం సాధించే వరకు కృషి ఆపకూడదని సూచించారు. గృహ హింసపై రాజీ లేదు పెళ్లి తర్వాత భర్త వేధింపులు, అనుమానాలు, వ్యసనాల వల్ల ఇబ్బంది పడుతున్న



మహిళలకు విశాఖ సిటీ పోలీసులు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. బాధితుల పిల్లల చదువు ఆగకుండా ఎన్‌జీఓల సహకారంతో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేధింపులపై కఠిన చర్యలు మహిళలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సురక్షిత నగరంగా విశాఖ దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరంగా విశాఖపట్నం గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ గుర్తింపును ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు హోంగార్డు నుంచి సీపీ వరకు ప్రతి పోలీసు అధికారి కృషి చేస్తున్నారని తెలిపారు. సహాయం కోసం.. మహిళలు ఏవైనా వేధింపులకు గురైతే పగలు, రాత్రి ఎప్పుడైనా 7995095799 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర మహిళలందరికీ విశాఖ సిటీ పోలీస్ తరఫున సీపీ శంఖబ్రత బాగ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సమస్యలపై మండల సమావేశంలో చర్చ

ఆనందపురం, మార్చి 1, ప్రభాతవార్త



ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు లేవనేత్తిన పలు సమస్యలపై చర్చ నిర్వహించారు. ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలో గల అన్ని శాఖల పనితీరు, ప్రగతి పై సమీక్షించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుచున్న వివిధ పథకాలు, ఎరువుల పంపిణీ, పదో తరగతి పరీక్షల సన్నద్ధత, ఆరోగ్య సేవలు, కౌమార బాలికలకు క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ, వీబిజి రామ్జీ పథకం ద్వారా కాలువల పూడిక పనులు చేయాలని మొదలగు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు కోరాడ వెంకట్రావు గారు వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, పిఎసిఎస్ ఏ చైర్మన్లు గండ్రేడ్డి సోంబాబు, దొంతల నాగరాజు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## పరిహారం చెక్కులు అందజేత

ఆనందపురం, మార్చి 1, ప్రభాతవార్త



సముద్రంలో మత్స్య వేటకు వెళ్లి మరణించిన బోయివీధికి చెందిన సురివిన వీర్రాజు కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం తగరపువలసలో అందజేశారు. అలాగే ప్రమాదంలో మరణించిన ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల ప్రసాద్ కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్టు తరపున రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించారు. కార్యక్రమంలో ఫిషరీస్ జేడీ లక్ష్మణరావు, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, సూరాల సత్య వర ప్రసాద్, గరికిన ఎల్లాజీ (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ విప్ గణబాబు

గోపాలపట్నం, మార్చి 1, ప్రభాతవార్త



అంగన్వాడీ కార్యకర్తలు మరియు హెల్పర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) స్పష్టం చేశారు. ఆదివారం గోపాలపట్నంలోని కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలకు రెండుసార్లు గౌరవ వేతనాన్ని పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళా తీసి వెళ్ళిపోయిందని, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న వేతనాల పెంపు డిమాండ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి త్వరలోనే శుభవార్త వింటారని హామీ ఇచ్చారు. అంగన్వాడీల చిరకాల కోరికైన గ్రాట్యుటీని అమలు చేసే దిశగా ప్రభుత్వం గత బడ్జెట్ లోనే రూ. 20 కోట్లు కేటాయించిందని, పదవీ విరమణ పొందిన వారికి తగిన ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 86 కోట్లతో తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని కేంద్రాలకు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యకర్తలకు పనిభారం తగ్గించేందుకు మరియు పారదర్శకత కోసం రూ. 75 కోట్లతో అత్యాధునిక 5జి స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల సేవల నాణ్యత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీలు ఎటువంటి అపోహలకు లోనుకావద్దని, తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.సమావేశంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు మరియు వార్డు ప్రెసిడెంట్లు బొడ్డేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు కూటమి అండ విపక్షాల ఉచ్చులో పడొద్దు

- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 1,ప్రభాతవార్త



రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం అంగన్వాడీలు చేపట్టిన ఛలో విజయవాడఖి కార్యక్రమంపై ఆయన ఆదివారం పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. విషం చిమ్ముతున్న విపక్షాలు గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా చక్కదిద్దుతోందని పల్లా పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న తరుణంలో, విపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అంగన్వాడీలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. "ప్రభుత్వంపై విషం చిమ్ముతూ అంగన్వాడీలను ఉద్యమాల వైపు ప్రేరేపిస్తున్న విపక్షాల మాయమాటలను నమ్మవద్దు" అని ఆయన విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వంపై నమ్మకంతో సహక రించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గుర్తు చేశారు.బాణసంచా ప్రమాదంపై దిగ్భ్రాంతి...కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా ప్రమాదంపై పల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వార్త తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించి ఘటనాస్థలికి వెళ్లడం వారి ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమని కొనియాడారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, విల్లా రామ్మోహన్ కుమార్, బలగా బాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలను అలరించేలా సంప్రదాయని సుద్దిని సుద్దపూసని

విశాఖపట్నం, మార్చి 1, ప్రభాతవార్త



శ్రీ శివాజీ ప్రొడక్షన్ బ్యానర్‌పై శివాజీ, లయ జంటగా నటించిన సరికొత్త చిత్రం"సంప్రదాయని సుద్దిని సుద్దపూసని". ఈ నెల 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శివాజీ, హీరోయిన్ లయ చిత్ర విశేషాలను పంచుకున్నారు. హీరో శివాజీ మాట్లాడుతూ.. ఇది ఒక విభిన్నమైన డార్క్ కామెడీ చిత్రమని తెలిపారు."గతంలో లయనేను కలిసి చేసిన మూడు సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో, ఈ సినిమాను కూడా అలాగే ఆదరించాలని కోరుతున్నాను. సాంకేతిక పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటించాం. ముఖ్యంగా సినిమా ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. మాస్టర్ రోహన్ పాత్ర అద్భుతంగా నటించాడు" అని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై స్పందిస్తూ.."ఒక పక్క ప్రజల కోసం మాట్లాడుతూనే, మరోపక్క కుటుంబాల కోసం సినిమాలు చేస్తాను. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రజల శ్రేయస్సు కోసం నా గళం వినిపిస్తూనే ఉంటాను. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి, లేదంటే ఇక్కడి వారు ఉపాధి కోసం మళ్లీ హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్త్రీ వస్త్రధారణపై తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని, అవి తన వ్యక్తిగత భావనలు మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. విశాఖపట్నంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు."నా తాతగారి స్వస్థలం విశాఖ కావడంతో చిన్నప్పుడు ఇక్కడే పెరిగాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు"ఉత్తర్థ. భర్త మీద చూపించే అతి ప్రేమ ఎలాంటి ఇబ్బందులకు దారితీస్తుందనే అంశాన్ని కామెడీగా, వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇది కేవలం ఫ్యామిలీ సినిమా మాత్రమే కాదు, అన్ని వయసుల వారు చూసి ఎంజాయ్ చేసేలా ప్రమోట్ చేయాలని కోరుతున్నాను" అని తెలిపారు.

## వెల్లంకిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఆనందపురం, మార్చి1, ప్రభాతవార్త



ఆనందపురం మండలం వెల్లంకిలో సుబ్బిరామరెడ్డి కల్యాణ మండపం వద్ద వృక్ష ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో కంటి రోగులు పాల్గొన్నారు. 110 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 20మందికి కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. ఇంకా కంటి పొరలకు ముగ్గురు, కంటి నరాలకి సంబంధించి ఒకరు, కంటి నల్ల గుడ్డుకు సంబంధించి నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కాకర వెంకట రమణ, శంకర్ ఫౌండేషన్ ఆదిత్య, ఆప్తమాలజిస్ట్ సుర్తి, వందన నర్సింగ్, క్యాంప్ కోఆర్డినేటర్ కే.ప్రసాద్, వై. రాజు, వైద్య శంకర ఫౌండేషన్ పాల్గొన్నారు.

## అన్నవరం సత్యదేవుని సేవలో వెన్నా శ్రీరామమూర్తి

గాజువాక,మార్చి 1,ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ఆదివారం కుటుంబ సమేతంగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో సాదర స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బందికి, కమిటీ సభ్యులకు శ్రీరామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

గాజువాక,మార్చి 1,ప్రభాతవార్త



మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడమాకిష్టం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సుమారు 40 మంది జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళారత్న సుంకర చలపతిరావు విద్యార్థులకు గర్వభంగం కథను వివరించి, అహంకారం వీడి సోదరభావంతో మెలగాలని హితవు పలికారు. తెలుగు భాషా విశిష్టతను వివరిస్తూ.. పిల్లలు పంచతంత్రం కథలను చదవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు పుస్తకాలను పఠించారు.

## ఇసుకలపాలెంలో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు తాపీ మిస్త్రీలు దుర్మరణం

పద్మనాభం,మార్చి 1, ప్రభాతవార్త





మండలంలో ఇసుకలపాలెం గ్రామంలో రేకుల షెడ్ నిర్మాణంలో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు తాపీ మిస్త్రీలు ఆదివారం దుర్మరణం చెందినట్లు పద్మనాభం సి.ఐ.సి.హెచ్.శ్రీధర్ చెప్పారు. ఈ సంఘటనపై ఆయన అందించిన వివరాలు ప్రకారం కృష్ణాపురం జగనన్న కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ కంటుబోతు శ్రీను(40),ఇసుకులపాలెంకి చెందిన కాళ్ల సూరీడు (63),గ్రామ చివరన గోవుల కోసం రేకుల షెడ్ నిర్మిస్తుండంగా షెడ్ పైపు అక్కడే ఉన్న విద్యుత్ హెచ్ టీ వైర్లు తగిలి ఇద్దరూ అక్కడకక్కడే మృతిచెందారు.ఇంకొకరు గాయాలపాలయ్యారు.దీంతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరమున్నీరయ్యారు. మృతుడు శ్రీనుకి భార్య రాజు, పాప, బాబు , కాళ్ల సూరీడుకి భార్య కనకరత్నం, కొడుకు ఉన్నారు. మృతుల భార్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సి ఐ చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు.

## అనంతుని సేవకులకు దుస్తులు అందజేసిన సుంకర నారాయణరావు

పద్మనాభం, మార్చి 1, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న అనంతపద్మ నాభస్వామి పేరుమీద స్వామివారి సేవకుకు కృష్ణాపురం గ్రామానికి చెందిన సుంకర నారాయణరావు ఆదివారం తెప్పోత్సవం సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాలు మరో మూడు రోజులు జరగనున్నాయి. దీంతో సేవకులు స్వామివారిని గ్రామ పురవీధులలో ఊరేగించినపుడు ఈ దుస్తులు ధరించనున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కె.రమణ,నాయకులు దామోదరరావు, తాలాడ పద్మనాభం ఎర్రినాయుడు, నాగు, సన్నిబాబు, సుమంతనాయడు పాల్గొన్నారు.

## జోరుగా జనసేన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం

ఆరిలోవ, మార్చి 1, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 10వ వార్డు డైరీ ఫారం వద్ద ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు పైడికొండల సునీల్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన జనసేన పార్టీ ఉధ్యమి సభ్యత నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగింది. ఈ సభ్యత నమోద కార్యక్రమంలో స్థాని కులు, యువత, మహిళలు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న ప్రజా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, కార్యకర్తలకు అందిస్తున్న ఇన్సూరెన్స్ సదుపాయాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు బండి రాజా రమేష్, సీనియర్ నాయకులు అన్నం తిరుపతిరావు, కొల్లా సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చెరకు తోట దగ్ధం

మునగపాక, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త



మండల కేంద్రం మునగపాకలో వేగి నాగ సూరి అప్పారావుకు చెందిన చెరకు తోట దగ్ధమైన విషయం తెలిసిందే. సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న చెరకు పంట శనివారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనతో రైతుకు గణనీయమైన నష్టం వాటిల్లింది. ఈ రోజు ఉదయం ఘటన విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ , మునగపాక మండల అధ్యక్షుడు పెంటకోట తో కలిసి దగ్ధమైన తోట ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను సమీక్షించి, బాధిత రైతుతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంఘటన స్థలం నుండే స్థానిక ఎమ్మార్ఓ గారికి మరియు సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, నష్టపోయిన రైతుకు తక్షణమే న్యాయం చేయాలని, తగిన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి, బాధిత రైతుకు తగిన పరిహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## నూతన సి సి రోడ్డులు నిర్మాణ పనులు ప్రారంభం



ఎస్ రాయవరం మార్చి 1, ప్రభాతవార్త

ఎస్ రాయవరం మండలం కొత్త రేవుపోల వరం గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మిస్తున్న సి సి రోడ్డులు నిర్మాణ పనులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. రోడ్లు నిర్మాణ పనుల నిమిత్తం 15 లక్షలు గ్రాంట్ వచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటరాజు. కొరుప్రోలు పి ఏ సి ఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ. మండల తెలుగు యువత అధ్యక్షులు కోడ లోవరాజు, సీనియర్ నాయకులు వాసపల్లి అడవిరాజు, మైలపల్లి అప్పలరాజు, అప్పన్న, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగు పై అవగాహన

గొలుగొండ మార్చ్ 1, ప్రభాతవార్త



రైతులు ఉద్యాన పంటల సాగు పై అవగాహన పెంపొందించుకోవాలని కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం సత్తిబాబు అన్నారు. ఎల్ పురం, విప్పలపాలెంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సాగులో మెలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ కూడా పలు ప్రోత్సాహాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని పంపకాలకు రైతులు మక్కువ చూపాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యానవన శాఖ ద్వారా గ్రీన్ లీఫ్ ఎఫ్ పి ఓ ద్వారా రూపొందించిన గోడ పత్రికను ఏ ఎల్ పురం సర్పంచ్ లోచుల సుజాత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి యస్. శిరీష, కె వి కె శాస్త్రవేత్త ఏన్ . సత్తిబాబు, సీఈఓ నాయుడు, న్యాచురల్ ఫార్మింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేష్, గ్రామ స్వరాజ్ సమితి ఎన్జీవో సభ్యులు, రైతులు తదితరలు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయాన్ని సందర్శించిన జనసేన నేత

అనకాపల్లి మార్చి1 (ప్రభాత వార్త)



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని. అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్ కి ఆదివారం సందర్శించారు. మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పర్యవేక్షణలో నూతన దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలోనే పునః ప్రారంభం కానున్న అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. అమ్మవారి నూతన దేవాలయ ప్రారంభోత్సవం , కళస ప్రతిష్టకు ఏర్పాట్లును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు విచ్చేయుచున్న సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను 81 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జోగి నాయుడు, రాష్ట్ర గవరా కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరు హరి ధర్మకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

### రెండుసార్లు వేతనాలు పెంచిన ఏకైక ప్రభుత్వం :ఎమ్మెల్యే రాజు

చోడవరం, మార్చి 1, ప్రభాతవార్త



అంగన్వాడీ కార్యకర్తలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కిందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కూడా చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యాలు కల్పనకు 86 కోట్ల 68 లక్షల రూపాయలు ప్రభుత్వ విడత చేసిందన్నారు. అలాగే 58,2శ4 మంది అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు సూపర్వైజర్లకు కోఆర్డినేటర్లకు ఎదుగుదలతో 5జి స్మార్ట్ ఫోన్లు అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రతి నెల ఒకటో తేదీన జీతం అందే విధంగా చర్యలు తీసుకుంటూ ఆలస్యం జీతాలుకి చెక్ పెట్టినట్టు చెప్పారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు హాజరు శాతం 70% నుంచి 96% పెరగడం కూటమి ప్రభుత్వ పాలనదీక్షకు నిదర్శనం అన్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రాడ్యుటి కలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఇందుకోసం 20 కోట్లు కేటాయించి అధికారులకు వచ్చిన 9 నెలలోనే అందించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గల 5000 మినీ అంగన్వాడి కేంద్రాలను ప్రధాన అంగన్వాడి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే మినీ అంగన్వాడి కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలను టీచర్లుగా పదోన్నతి కల్పించి వేతనాలు అందించేందుకు కృషి జరుగుతుందని చెప్పారు. అంగన్వాడీలు కోరుతున్న డిమాండ్లలో ఎప్పటికైనా డిమాండ్లు పరిష్కారం అయ్యాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక రంగాన్ని దివాళి తీసి వెళ్లిందని ఫలితంగా తమ ప్రభుత్వం వారు చేసిన అప్పులను రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు కొత్తగా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టవలసిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పెద్ద గుమ్మలూరు గ్రామంలో వాలీబాల్ పోటీలు

(ఎస్ రాయవరం మార్చి1 ప్రభాతవార్త



పెద్ద గుమ్మలూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారు, మరిడిమాంబ అమ్మవారి నూతన ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం వాలీబాల్ పోటీలు మాజీ ఎంపీపీ ఏజర్ల వినోద్ రాజు ప్రారంభించారు. పలు గ్రామాల నుండి 20 పురుషులు జట్లు 6 స్త్రీలు జట్లు పాల్గొన్నరని ఆయన తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గురువారం నూతన ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట భాగంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి ఒకటో బహుమతి 10000. రెండో బహుమతి 8000. మూడో 5000. అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనకాపల్లి కేంద్రంగా ఎస్సీ ఎస్టీ బీసీ ప్రభుత్వ మహిళా హాస్టల్స్ ఏర్పాటు చేయాలి

### మార్చి 9నుండి 14 వరకు రిలే నిరాహార దీక్షలు

చోడవరం, మార్చి 1, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ,బీసీ మహిళ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి మార్చి 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు చేసే రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆదివారం చోడవరం ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద గోడ పత్రిక లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళా హాస్టల్స్ ఏర్పాటుకై గతంలో అనేక సార్లు జిల్లా అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధికి విన్నవించుకున్న ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఒకే ఒక బీసీ మహిళ హాస్టల్ ఉంది. అందులో కూడా వందమంది పట్టే బిల్డింగ్లో దాదాపు 200 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతూ ఉంటున్నారు. జిల్లా కేంద్రానికి అనేకమంది విద్యార్థులు చదువుకోవడానికి వచ్చి ప్రభుత్వ హాస్టల్స్ లో ఖాళీ లేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉంది. ఈ సమస్యను ఉన్నత అధికారులకు ఎన్నోసార్లు వివరించిన ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కాబటి అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ ఎస్టీ బీసీ మహిళ కళాశాల హాస్టల్స్ ఏర్పాటుకై మార్చి 9 నుంచి 14వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేసే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని నిర్ణయించమన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరానికి ఎస్సీ ఎస్టీ బీసీ ప్రభుత్వ మహిళా హాస్టల్స్ ఏర్పాటుకై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థినిలను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్,సింహాద్రి,బాబీ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉపమాక వెంకన్నపై మొట్టమొదటి పాట ఆవిష్కరణ.!



(నక్కపల్లి, ప్రభాతవార్త)

నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న తిరుమల తిరుపతి దేవస్థానం వారి అనుబంధ దేవాలయమైన శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారిపై రావోయి ఉపమాక దేవా పరా మొట్టమొదటి పాటను ఆదివారం సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. దీనికి సంబంధించి ప్రముఖ అష్టావధాని కవిత్రి డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవి రచించిన పాటను తిరుమల తిరుపతి దేవస్థానం డోలు విద్వాన్ ఎన్. సింహాచలం స్వరపరచగా కళ్యాణి రాగంలో ఆదితాళంలో స్వర రచన చేశారు. పురాతనమైన స్వామివారి ఆలయం పై మొట్టమొదటిసారిగా రచన చేసి స్వరపరచడం పట్ల నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రచన చేసిన గాయత్రీ దేవిని స్వర రచన చేసిన ఎన్. సింహాచలం లను తిరుమల తిరుపతి దేవస్థానం సూపరింటెండెంట్ క్రాంతి కుమార్, డి పి విశాఖపట్నం ఇంచార్జ్ సత్యనారాయణ, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాల బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు డివి రామారావు, కార్యదర్శి శ్రీపాద ప్రణవ్ ,దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం డోలు విద్వాన్ స్వరరచన చేసిన సింహాచలంకు దేవస్థానం ప్రధాన అర్చకుడు వరప్రసాదాచార్యులు పదివేల రూపాయలు పారితోషకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నందూరి వెంకట రాజ గోపాలచార్యులు, చెరుకూరి వెంకటేశ్వరరావు, దవరసింగి సన్యాసిరావు పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్సవాల నిర్వాహణకు ఎంవిఆర్ ఆర్థిక తోడ్పాటు అమోఘం

### నిర్వాహకుల నుండి ప్రశంసల వెల్లువ

అనకాపల్లి,మార్చి1 ( ప్రభాత వార్త)



స్థానిక విజయ రామరాజు పేట మరిడిమాంబ ఉత్సవ నిర్వాహకులకు విరాళాలు అందజేసి ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తన ఉదారతను చాటుకున్నారు. అలాగే కశింకోట,పరిసర ప్రాంతాలలో జరిగిన ప్రతి ఉత్సవం దిగ్విజయంలో ఎం వి ఆర్ అందించిన ఆర్జిత తోడ్పాటు అత్యంత కీలకమైనది.విజయరామరాజు పేట గ్రామ కమిటీ సభ్యులకు1,25 వేల రూపాయలు, పోలారపు బ్రదర్స్ కు 40 వేలు, యల్లంకి సత్తిబాబు కు 50 వేలు, నాని కు 25 వేల రూపాయలు చొప్పున సహాయం చేసిన ఎంవిఆర్ సేవా స్ఫూర్తిని కొనియాడిన ఉత్సవ ప్రోగ్రాంల కన్వీనర్లు ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ ను స్వయంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం మీరు అందించిన విరాళం కమిటీ సభ్యులకు ఎంతో తోడ్పడిందని వారు తెలిపారు. ఆయన సహకారంతో ఆలయ ప్రాంగణం విద్యుత్ అలంకరణలు, భక్తులకు అన్నప్రసాదం, సాంస్కృతిక కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించగలిగామని కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగ ఘనంగా ముగిసిన సందర్భంగా ఎం.వి.ఆర్ సేవాభావాన్ని పలువురు ప్రశంసిం చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా మారుతున్న ఎం.వి.ఆర్ ను పలువురు ప్రతినిధులు, ఎం వి ఆర్ అభిమానులు అభినందించారు.దీనిలో భాగంగా ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ కు శాలువా కప్పి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు.ఈ మేరకు... గ్రామ కమిటీ సభ్యులకు 1,25,000 రూపాయలు పోలారపు బ్రదర్స్ (లోకేష్ రాము) లకు 40000 రూపాయలు, ఎల్లంకి సత్తిబాబు కు 50 వేల రూపాయలు, నాని కు పాతికవేల రూపాయలను ఎం వి ఆర్ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివ రామ సత్యనారాయణ, కార్యదర్శి పలక రాము కోశాధికారి పిట్ల బుద్దే శ్వర రావు, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు పలు కుల సంఘాల ప్రతినిధులు తోపాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, ఏపూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి

(రాంబిల్లి మార్చి 01 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం గోవిందపాలెం గ్రామంలో మేకల కాపరి జోగా అప్పారావు (75) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు, శనివారం సాయంత్రం సుమారు మూడు గంటల ప్రాంతంలో వాడ నరసాపురం గ్రామ పరిధిలో ఉన్న దుర్గాలమ్మ గుడి మరియు నావికాస్తావరం ప్రధాన ద్వారం మధ్యలో వాడ నరసాపురం గ్రామానికి చెందిన కులకరి లికిత్ (16) టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని అధిక వేగంతో నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి మేకల కాపరిని ఢీకొట్టడంతో తలకి, నడుముకి బలమైన గాయాలు తగిలాయి, తల నుండి అధిక రక్తస్రావం కావటంతో అచ్యుతాపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో మరణించాడు, ఈ విషయంపై ఫిర్యాదు అందిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్థానిక సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపారు.

## వైభవంగా శ్రీ సిద్ధి వినాయక 26వ వార్షికోత్సవం

(ఎస్ రాయవరం మార్చి 1 ప్రభాత వార్త



పెద ఉప్పలం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సిద్ధి వినాయక 26వ వార్షికోత్సవంఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుండి ఆలయంనకు చేరుకొని స్వామివారి ప్రత్యేక పూజాల్లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం లో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోశేటి వెంకటరమణ.గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## బహిరంగమార్కెట్ కు గురుకులకళాశాల నిత్యావసర సరుకులు..?

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న పిడి ఉదయ్, సెక్యూరిటీ సిబ్బంది

కొయ్యూరు మార్చి1 ప్రభాతవార్త




మండలంలోని కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల వసతి గృహం నుండి బహిరంగంగా మార్కెట్కు అక్రమంగా తరలిపోతున్న నిత్యవసర సరుకులను కళాశాల పిడి చెట్టి ట్టి ఉదయ్, సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం రాత్రి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కళాశాల వసతి గృహంలో రోజువారి వేతనానికి పనిచేస్తున్న ఒక వర్కర్ ద్వారా ఈ నిత్యవసర సరుకులు బహిరంగ మార్కెట్కు తరలిస్తుండగా తాము పట్టుకున్నామని, ఈ విషయాన్ని వెంటనే గిరిజన సంక్షేమ శాఖ డిడి, ఏటిడబ్ల్యూఓ లకు తెలియజేసినట్టు పిడి వివరించారు. కాగా ఈ విషయమై నిందితుడైన వర్కర్ మాట్లాడుతూ- తనకు డిప్యూటీ వార్డెన్ సరుకులను ఇచ్చి బయటకు పట్టికెళ్ళమన్నారని తెలిపాడు.

## చిట్టంపాడు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ...!

### డా.సురేష్ కుమార్ ను సన్మానించిన స్థానిక నేతలు

కొయ్యూరు, మార్చి1, ప్రభాతవార్త



మండలంలో చిట్టంపాడు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు డా. వైఎస్ఆర్ టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరీక్షలకు అవసర మైన సామగ్రి (పెన్నులను అట్టలను) వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- 10వ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ముందుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి పరీక్ష కేంద్రానికి వెళ్ళే ముందు ఎటువంటి ఒత్తిడికి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాల సిబ్బందికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేమాని నూకాలమ్మ , ఎంపీటీసీ బిడిజన అప్పారావు ,యువ నాయకులు వారా నూకరాజు,వారా గంగమ్మ,దేపూరి రాజు,స్కూల్ కమిటి చైర్మన్ ధవళ చిన్నారావు ,వార్డెన్ సతీష్ ,మాస్టర్ వారా కన్నబాబు ,గ్రామస్తులు పీటర్,బాలరాజు ,ప్రసాద్ తదితరులు పాల్గొని, డా. సురేష్ కుమార్ ను ఘనంగా సన్మానించారు.

## 3న అమ్మవారి ఆలయం మూసివేత



పాడేరు,మార్చ్1,ప్రభాతవార్త:

పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం రోజున సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా అమ్మవారి ఆలయం ముసి వేయబడునని ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆలయంలో మంగళవారం జరగనున్న అన్న సమారాధన కార్యక్రమం నిలుపుదల చేయనున్నామని బుధవారం రోజు నుండి యధావిధి భక్తులకు అమ్మవారి దర్శనాలు యధావిధిగా జరుగుతాయని అమ్మవారి భక్తులు గమనించాలని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు తెలియజేశారు.

## చింతాలమ్మ ఘాట్లో రోడ్డు ప్రమాదం..!

### తీవ్రగాయాలపాలైన వీఆర్వో సత్యనారాయణ, తనయుడు రవికిరణ్

కొయ్యూరు మార్చి1 ప్రభాతవార్త



ఆదివారం సాయంత్రం మండలంలోని చింతాలమ్మ ఘాట్ హైవే రోడ్డుపై జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో కారు బైక్ ఢీకొని రాజేంద్రపాలెం విఆర్ఓ సత్య నారాయణ, అతని తనయుడు రవికిరణ్ తీవ్ర గాయాల పాల య్యారు. వీఆర్వో సత్యనారాయణ, తనయుడు రవి కిరణ్ కొయ్యూరు నుండి కృష్ణదేవపేట వైపు బైక్ పై వెళుతుండగా, చింతాలమ్మ ఘాట్ మధ్యలో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో, బైక్ పై ఉన్న విఆర్ఓ అతని తనయుడు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంపై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## గిరిజనుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తా

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



రంపచోడవరం. మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ఆదివారం రంపచోడవరం ఆయన నివాసంలో గిరిజనుల సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరిగింది. వై.రామ వరం మండలం, యార్లగడ్డ పంచాయతీ, శేషరాయి గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు రోడ్డు సమస్యలపై చైర్మన్ ను కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే యార్లగడ్డ గ్రామం నుంచి వయా కొమరవరం, గంగవరం మీదుగా పెరికవలస వరకు సుమారు 20 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా వై.రామవరం నుంచి గురమంద శివాలయం వరకు రహదారి నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా నూకలమిద్ది గ్రామం, దారలోవ గ్రామం పరిధిలోని గ్రామ సచివాలయం, పాత వాటర్ ట్యాంక్, ఆశ్రమ పాఠశాల మరియు సమీప 5 గ్రామాలకు ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిందిగా దరఖాస్తు సమర్పించారు. చైర్మన్ బొజ్జిరెడ్డి గిరిజన ప్రజల రోడ్లు, విద్యుత్ సమస్యలను విని, అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, తమ వంతుగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా చైర్మన్ బొజ్జిరెడ్డి తెలిపారు.

## మహిళల భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత..!

### అంతర్జాతీయ మహిళా దినోత్సవవారోత్సవాల అవగాహన ర్యాలీ...!




కొయ్యూరు, మార్చి 1, ప్రభాతవార్త

కొయ్యూరు పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల భాగంగా ఆదివారం మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాజేంద్రపాలెం వారపు సంత నుండి గుడ్లపల్లి జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది కొయ్యూరు ప్రాంతానికి చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా మహిళా భద్రత, మహిళా సాధికారత, బాల్య వివాహాల నిరోధం మరియు గంజాయి వ్యతిరేక సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అందరూ ఒకే స్వరంతో నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. గుడ్లపల్లి జంక్షన్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి మహిళల గౌరవం, భద్రత మరియు సామాజిక బాధ్యతపై బలమైన సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. మహిళల భద్రత, గౌరవం మరియు సమానత్వం కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు.

## పంచదార్లలో ఉచిత కంటి శిబిరం

(రాంబిల్లి మార్చి 01 ప్రభాతవార్త)




రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు, అనకాపల్లి భువనేశ్వరి ఐ కేర్ క్లినిక్ డాక్టర్ లండా నరసింహ మూర్తి ఆధ్వర్యం లో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాంబిల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వర్లు (దినుబాబు) పాల్గొన్నారు, ఈ శిబిరానికి నిపుణులైన వైద్యులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు మరియు తగిన సూచనలు అందించడం జరిగిందన్నారు, కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తూ చికిత్స వివరాలు తెలియజేశారు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు కూడా శిబిరానికి విశేషంగా హాజరై సద్వినియోగం చేసుకున్నారు, సుమారు 80 మంది రోగులు తమ కళ్ళను పరీక్షించుకున్నారని సిబ్బంది తెలిపారు. సిబ్బంది శేషు, మిశ్రా, నాయుడు, స్థానిక స్కూల్ మాజీ చైర్మన్ రామారావు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం..!

కొయ్యూరు, మార్చి1 ప్రభాతవార్త



మండలంలోని రామరాజుపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో చెదల గణేష్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వలసంపేటకు చెందిన గణేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామరాజు పాలెం వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం అందించారు. కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

